పంట పొలాల్లో బురద మేటలు


ఆత్కూరు గ్రామ శివారులో వరద ప్రవాహానికి కుళ్లిపోయిన పత్తి పైరు


ఆత్కూరు గ్రామ శివారులో వరద ప్రవాహానికి వరిపైరుపై మేట వేసిన మట్టి

- కుళ్లిపోయిన వరి, పత్తి పైర్లు
- పంటలకు తీవ్ర నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

జి.కొండూరు: ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేపట్టిన రైతుల ఆశలకు అకాల వర్షంతో ఆదిలోనే గండి పడింది. పెట్టిన పెట్టుబడి పోయింది. కాలం కూడా వెనక్కిపోవడంతో తిరిగి సాగు చేపట్టే అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడు బుడమేరు వరద ప్రవాహంతో చెరువులకు, కాల్వలకు, వాగులకు పడిన గండ్లతో పంట పొలాల్లో మట్టి, ఇసుక, బురద మేటలు వేశాయి. పైరు పోయి ఆవేదన చెందుతున్న రైతులకు ఈ మేటలను తొలగించడం తలనొప్పిగా మారింది. వరద ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన తమకు నష్ట పరిహారం అందించడంతో పాటు మట్టి, ఇసుక, బురద మేటలకు అదనంగా పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సాగు చేపట్టే అవకాశం లేదు

వారం రోజులకు పైగా వరద నీరు పంట పొలాల్లో నిల్వ ఉండడంతో వరి, పత్తి, పెసర, మినుము వంటి పంటలు కుళ్లిపోయాయి. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బురద, మట్టి, ఇసుక మేటలు తొలగించేందుకు అదనపు ఖర్చుతో పాటు మరో పంట వేసేందుకు కాలం కూడా వెనక్కిపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని రైతులు వాపోతున్నారు.

నియోజకవర్గంలో నష్టం అంచనా..

జి.కొండూరు మండలంలో వరి 1,625 హెక్టార్లు, పత్తి 1,600 హెక్టార్లు, పెసర 8 హెక్టార్లు, మినుము 5 హెక్టార్లు, ఇబ్రహీంపట్నం మండలంలో వరి 1,605 హెక్టార్లు, పత్తి 265 హెక్టార్లు, మినుము 470 హెక్టార్లు, పెసర 20 హెక్టార్లు, మొక్కజొన్న 34 హెక్టార్లు, మైలవరం మండలంలో వరి 1,050 హెక్టార్లు, పత్తి 200 హెక్టార్లు, మినుము 230 హెక్టార్లు, పెసర 180 హెక్టార్లు, రెడ్డిగూడెం మండలంలో వరి 200 హెక్టార్లు, మినుమ 70 హెక్టార్లు, పెసర 8 హెక్టార్లు, వేరుశనగ 10 హెక్టార్లు, పత్తి 265 హెక్టార్లు, విజయవాడ రూరల్ పరిధిలో 1,800 హెక్టార్లలో వరి, పత్తి రైతులు నష్టపోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.



తీవ్రంగా నష్టపోయాం

ఐదు ఎకరాల్లో పత్తి, ఆరు ఎకరాల్లో వరి సాగు చేశా. బుడమేరు వరద ప్రవాహంతో పైరు మొత్తం దెబ్బతింది. ఇప్పటికే రూ. 3 లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం జాప్యం చేయకుండా నష్ట పరిహారం అందించాలి.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు, కవులూరు గ్రామం



వరి పైరు కుళ్లిపోయింది

13 ఎకరాల్లో వరిపైరు సాగు చేశా. బుడమేరు వరద ప్రవాహానికి వరి పైరు పూర్తిగా కుళ్లిపోయింది. ఇప్పటి వరకు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలి.

– బెజవాడ వీరయ్య, రైతు, కవులూరు గ్రామం

ముంపులోనే పంట పొలాలు


తిరువూరులో మల్లమ్మ చెరువుకు పడిన గండి నుంచి పొలాల్లోకి చేరుతున్న నీరు


తిరువూరు రాజుపేటలోని పంట పొలాల్లో నిలిచిన నీరు

తిరువూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో తిరువూరు మండలంలోని సాగునీటి చెరువుల ఆయకట్టులో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. తిరువూరు శివారు మల్లమ్మ చెరువు కట్టకు గండి పడటంతో దిగువ వరి పొలాలు పూర్తిగా నీట మునిగాయి. పడమటివాగు, కట్టెలేరులకు వరదనీరు చేరడంతో మండలంలోని పీటీకొత్తూరు, లక్ష్మీపురం, కోకిలంపాడు, రాజుపేట, మునుకుళ్ల, అక్కపాలెం, గానుగపాడు గ్రామాల్లో రెండు వేల ఎకరాల్లో వరిపైరు పూర్తిగా నీటమునిగింది. వారం రోజులుగా నీటిలోనే నానుతున్న వరినారు చేతికందే అవకాశం లేదు. పత్తి, మిర్చి పైర్లకు సైతం వరద కారణంగా తీవ్ర నష్టం వాటిల్లింది. తిరువూరు మండలంలో పెసర, మినుము, పత్తి పంటలు 500 ఎకరాల్లో మునిగిపోయినట్లు రైతులు తెలిపారు. వరద ఉధృతి తగ్గడంతో పొలాల్లో నీరు తొలగించడానికి రైతులు ప్రయత్నిస్తున్నారు. వరి పైరుకు ఎకరాకు రూ.30 వేలకు పైగా ఖర్చవగా, మళ్లీ నాట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు చెబుతున్నారు. ఎర్రబారిన పత్తి ఎదుగుదల ఉండదని, పత్తి, మిర్చిపైర్లకు ఎకరాకు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని తెలిపారు. కౌలు రైతులు పంటలకు పెట్టుబడితో పాటు భూ యజమానులకు కౌలు సగం చెల్లించగా, వరదల కారణంగా తీరని నష్టాల పాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంధ్యపు వాగుపై తాత్కాలిక వంతెన నిర్మిస్తాం

మంత్రి పార్థసారథి


చెక్కపల్లి–చింతలవల్లి మధ్య గండి ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి తదితరులు

ముసునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు వచ్చిన వెంటనే సంధ్యపు వాగుపై శాశ్వత వంతెన నిర్మాణ పనులు చేపడతామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కె.పార్థసారథి అన్నారు. ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు, చెక్కపల్లిల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెక్కపల్లి– చింతలవల్లి గ్రామాల మధ్య గండిపడి కొట్టుకుపోయిన సంధ్యపు వాగు వంతెనను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం తాత్కాలిక వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గోగులంపాడులో గొర్రెల కాపరుల సమస్యలను అడిగి తెలుసుకుని, గొర్రెల్లో నట్టల వ్యాధి నివారణకు అవసరమైన మందుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. తొలుత ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. హాస్టల్లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వర్షాలకు పొంగిన చెక్కపల్లి పెద్ద చెరువును పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. తహసీల్దార్ రాజ్ కుమార్, ఆర్అండ్‌బీ డీఈ బాబూరావు, ఏఈ అశోక్ బాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టంపై నివేదికలు ఇవ్వండి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటరత్నం

చాట్రాయి: భారీ వర్షాలకు జరిగిన నష్టంపై తగిన నివేదిక ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భారీవర్షాలు, వరదలకు జరిగిన నష్టంపై అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు ఆయా శాఖల పరిధిలో జరిగిన నష్టంపై అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని చెప్పారు. మండలంలోని చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే కొట్టుకుపోయిందని, శాశ్వత పనుల కోసం కోటి రూపాయలతో అంచనాలు తయారు చేశామని, జనార్దనవరం తుమ్మగూడెం పంచాయతీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.10 లక్షలతో అంచనాలు తయారు చేశామని పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణ తెలిపారు. 45 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారి బి.శివశంకర్ సభకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గాప్రసాద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణ



మైలవరం: గ్రామంలోని బాలయోగినగర్, దళితవాడ తదితర ప్రాంతాల్లోని వీధుల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని మంగళవారం తొలగించారు. పంచాయతీ సిబ్బంది బ్లీచింగ్ చల్లారు. మైలవరం పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ పర్యవేక్షించారు.

- **కొటికలపూడి(ఇబ్రహీంపట్నం):** కొటికలపూడి గ్రామంలో సర్పంచి రెంటపల్లి నాగరాజు నేతృత్వంలో వీధుల్లో చెత్తచెదారం తొలగించి ట్రాక్టర్ ద్వారా తరలించారు. సున్నం, బ్లీచింగ్ వీధుల్లో చల్లారు.

అన్నదానం

ఇబ్రహీంపట్నం: సీపీఎం ఆధ్వర్యంలో ఫెర్రీ రామాలయం వద్ద 400 మంది వరద బాధితులకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్, నాయకులు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** విజయవాడలోని వెయ్యిమంది వరద బాధితులకు ఆగిరిపల్లి రజక సంఘం ఆధ్వర్యంలో భోజనాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు నాగరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల ఐలమ్మకు నివాళి



మైలవరం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం రైతాంగ సాయుధ పోరాటం చేసిన వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ అని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు అన్నారు. చిట్యాల ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం మైలవరం నూజివీడు రోడ్డులోని ఆటోస్టాండ్‌లో రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి. వీరభద్రరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

- **పెనుగొలను(గంపలగూడెం):** వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు నారాయణరావు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో పౌష్టికాహారం

చాట్రాయి: చిరు ధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీఓ నూరాణి అన్నారు. మంగళవారం చాట్రాయిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. సూపర్‌వైజర్ గాయత్రీ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యులు విధులకు హాజరు

గంపలగూడెం: జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు దశలవారీ ఆందోళనలో భాగంగా మంగళవారం గంపలగూడెం మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. గంపలగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి, ప్రైమరీ హెల్త్ సెంటర్స్ జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వి. శృతి, వైద్యులు భార్గవ్, ఊటుకూరు వైద్యులు సురేష్, శశిప్రియ నల్లబ్యాడ్జీలను ధరించి రోగులకు వైద్య సేవలు అందించారు. శృతి మాట్లాడుతూ వైద్యులకు పీజీ అవకాశాలు తగ్గించడం అన్యాయమన్నారు. ఇది గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో సేవలను ప్రభావితం చేస్తుందని చెప్పారు.

డీజే సిస్టమ్‌కు అనుమతి లేదు

తిరువూరు: వినాయక చవితి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగించవద్దని తిరువూరు సెక్టార్–1 ఎస్ఐ సత్యనారాయణ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషను ఆవరణలో మండలంలోని వినాయక నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవ పందిళ్లలో డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటుకు అనుమతి లేదని, నిమజ్జన ఊరేగింపుల్లో సైతం వీటిని వినియోగించవద్దని కోరారు. సెక్టార్–2 ఎస్ఐ వెంకటరావు పాల్గొన్నారు.

ముంపు నివారణ చర్యలు చేపట్టాలి

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు



తిరువూరు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు హడావుడి చేయడం కంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ప్రజలకు కలిగే నష్టాన్ని నివారించవచ్చని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. విజయవాడలో ఇటీవల వరద బీభత్సం కారణంగా నష్టపోయిన ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సహాయక చర్యలపై ఆయన స్పందిస్తూ విజయవాడ పరిసర ప్రాంత ప్రజలకు ప్రమాదకరంగా ఉన్న బుడమేరు విషయంలో ప్రభుత్వం ఇకనైనా మేల్కొనాలని అన్నారు. వరద బాధితులకు ఆహారం, తాగునీరు పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని, వలంటీర్ల సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కృష్ణలంక వరద ముంపునకు గురికాకుండా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించిన పటిష్టమైన సిమెంటు వాల్ లక్షలాది కుటుంబాల ప్రాణాలు కాపాడిందన్నారు. బుడమేరు వరద విజయవాడ వైపు రాకుండా డైవర్షన్ చానల్స్ నిర్మాణం చేయడం, కొల్లేరుకు బుడమేరు నీటి మళ్లింపు తదితర చర్యలను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సూచించారు. వరద ముంపునకు గురైన విజయవాడ నగర ప్రజలకు, ఎన్టీఆర్ జిల్లాలోని గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్షణ సహాయం అందించడంతో పాటు సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు


గంపలగూడెంలో దెబ్బతిన్న పత్తి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

గంపలగూడెం: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న పంట పొలాలను శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. తోటమూల, గంపలగూడెం గ్రామాల్లో వరద ముంపుతో కుళ్లిపోయిన, రంగుమారిన వరి, పత్తి పైర్లను శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణంరాజు, బి. వెంకటేశ్వర్లు, పీఎస్ శివప్రసాద్, ఎన్. రాజశేఖర్ బృందం పరిశీలించారు. దెబ్బతిన్న పంటల నష్టం అంచనా వేసి పాక్షికంగా దెబ్బతిన్న పత్తి పైరు కోలుకునేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పంట పూర్తిగా పాడైన పత్తి చేలలో ప్రత్యామ్నాయ పైర్లు వేసుకోవాలన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న పైర్లకు నీరు తగ్గిన తర్వాత ఎకరానికి 25 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ ఎరువులను వేసి పంటను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములను ఒక లీటరు నీటికి కలిపి నేల తడిచేలా పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మపోషకాలను పైపాటుగా అందించడం ద్వారా మొక్కకు ఒత్తిడి తగ్గి త్వరగా కోలుకునే అవకాశం ఉందన్నారు. దీనికై ఫార్ములా 4 లేదా ఆరు లేదా మల్టీకే వంటి వాటిని లీటరు నీటికి రెండు గ్రాముల వంతున కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపునకు గురైన వరి పొలాలు తిరిగి కోలుకునేందుకు ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను వెదజల్లాలన్నారు. ఇటీవల నాటిన మిరప వర్షాల ప్రభావానికి గురైతే తేలికపాటి యూరియా అందించాలని, తదుపరి భూమి తడిచేలా సిలీంద్రనాశిని కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరుకు మూడు గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి బి. సాయిశ్రీ, వీఏఏ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటలకు మేలు

తిరువూరు: ఇటీవల వరద ముంపునకు గురైన పొలాల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గరికపాడు వ్యవసాయ పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం తిరువూరు శివారు పీటీ కొత్తూరులో వరద ముంపునకు గురైన పత్తి, వరిచేలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎస్. కృష్ణంరాజు, బి. వెంకటేశ్వర్లు, పీఎస్ ప్రసాద్, రాజశేఖర్, ఏఓ పద్మ, ఎంపీఈఓ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నూజివీడులో కార్మిక, రైతు సంఘాల నిరసన


నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నూజివీడు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారంతో పాటు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలకు స్వస్తి పలకాలని సీఐటీయూ నూజివీడు పట్టణ ప్రధాన కార్యదర్శి జి. రాజు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలు, రైతు సంఘాల రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా నూజివీడు చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాలతో గత పదేళ్లలో దేశంలో పేదరికం, నిరుద్యోగం, అసమానతలు పెరిగి ప్రజల ఆదాయం పడిపోయిందని ధ్వజమెత్తారు. రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణలో భాగంగా విశాఖ ఉక్కు కర్మాగారానికి గనులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడారు. రైతు సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

● శ్రీగణనాథం నమామ్యహం


వామకుంట్లలో గణపతికి విశేష పూజలు


గంపలగూడెం మండలం కొణిజెర్ల బీసీ కాలనీలో పూజలు


తిరువూరు బోస్ సెంటర్లో భక్తుల పూజలు


విస్సన్నపేటలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజు మంగళవారం తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గాల్లో గణనాథులకు విశేష పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాల వద్ద జరిగిన పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. –తిరువూరు/గంపలగూడెం/విస్సన్నపేట

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అవగాహన

నూజివీడు: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ శర్మిష్ఠ అన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం నేపథ్యంలో మంగళవారం ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శర్మిష్ఠ మాట్లాడుతూ విద్యార్థులు తమ విషయాలను స్నేహితులతో ఒకరికొకరు పంచుకోవాలన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు శారీరక, మానసిక ఇబ్బందులను ఆప్తులతో పంచుకోవడం ద్వారా మనసుపై పడే భారాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. సైక్రియాటిస్టులు పవిత్ర, శ్రీనివాసరావు పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

ఇబ్రహీంపట్నం మండలంలో 6,246 ఎకరాల్లో పంట నష్టం

ఇబ్రహీంపట్నం: మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6,592 ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారని, 6,246 ఎకరాల పంట వరద ముంపునకు దెబ్బతిందని మండల వ్యవసాయాధికారి డి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పంటలు 5,985 ఎకరాలు, ఉద్యాన పంటలు 261 ఎకరాలకు నష్టం వాటిల్లిందన్నారు. వరి 4,018 ఎకరాలు, పత్తి 660 ఎకరాలు, మినుము 1,172, పెసర 50 ఎకరాలు, మొక్కజొన్న 85 ఎకరాల్లో దెబ్బతిందని చెప్పారు. 1,629 మంది రైతులకు నష్టం వాటిల్లిందన్నారు. ఒక హెక్టారు వరి పంటకు రూ.17 వేలు, పత్తి రూ.17 వేలు, మినుము, పెసర రూ.10 వేలు, మొక్కజొన్న రూ.12,500 చొప్పున ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ప్రకటించిందన్నారు. మండలంలో రూ.3.71 కోట్లు రైతులకు అందనుందని ఏఓ వివరించారు.

బుడమేరు వాగుపై చప్టా ధ్వంసం రైతుల ఇబ్బందులు



మైలవరం: భారీ వర్షాలు, వరదలకు మైలవరం నారాయణ నగర్ (5వ వార్డు)లో బుడమేరు వాగుపై ఏర్పాటు చేసిన లో లెవెల్ వంతెన కొట్టుకుపోయింది. వాగు అవతలి వైపున మైలవరం రైతులకు చెందిన వ్యవసాయ భూములు, మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలువురు రైతులు నిత్యం తమ వాహనాలు, ట్రాక్టర్లతో వాగు ఆవలి వైపున్న పంట పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చప్టా ధ్వంసం కావడంతో రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



గంపలగూడెం: అండర్–14 రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారు. నూజివీడు ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన రావూరి కృతిక్‌రామ్, ఉప్పతల కృష్ణవేణిలను అధికారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనే టీమ్‌కు ఎంపిక చేశారు. వీరు త్వరలో శ్రీకాకుళం జిల్లా పలాసలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ బంకా రాంబాబును పాఠశాల హెచ్ఎం బి. కిరణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గండిని వెంటనే పూడ్చాలి



నూజివీడు: తూర్పు దిగవల్లి, ముక్కొల్లుపాడుల మధ్య ఉన్న ఎన్నెస్పీ కాలువకు పడిన గండిని ప్రభుత్వం వెంటనే పూడ్చాలని రైతు సంఘం ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గండి పడిన ప్రాంతాన్ని మంగళవారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ గండి పడటం వల్ల 30 ఎకరాల్లోని వరి, మినుము పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, గండిని వెంటనే పూడ్చాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, కూచిపూడి నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు చాట్ల పుల్లారావు, బాధిత రైతులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ రాయి అపహరణపై విచారణ చేయాలని ఫిర్యాదు



విస్సన్నపేట: పుట్రేల పంచాయతీ జానలగడ్డ గ్రామంలో ముత్యాలమ్మ రాయి 2018లో అపహరణకు గురైనట్లు తమ దృష్టికి వచ్చిందని, దానిపై పూర్తి విచారణ జరపాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు విచారణ చేపడతామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వస్త్రాలు పంపిణీ

పెనుగొలను(గంపలగూడెం): వరదల బాధితులకు మంగళవారం గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో బట్టలు, పండ్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ సత్యవతి సౌజన్యంతో 10 మంది వరద బాధితులకు వీటిని అందజేశారు. సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.